# భయం

సన్నగా వానపడుతున్నది. వీధిలో దీపాలు మినుకు మినుకు మంటున్నాయి. కొద్దిగా చలిగావుంది. చదువుతున్న పుస్తకాన్ని విసిరి అవతల పారవేసింది లలిత. ఛీ... ఎక్కడా ఇదే. ఎంత మరచిపోదామన్నా వొదలటములేదు తనను. తను ఎందుకు బతకాలి ఇంకా. ఎవరికోసం. తనని అతడు ఎందుకు పెళ్ళిచేసుకోవాలి. తరవాతయినా వొదిలెయ్యొచ్చు గదా! ఊహూ. అలా ఎందుకు చేస్తాడు! తనని మనిషిగా ఉంచే బాధ పెడతాడు. లోకానికి తెలీకండా తను చేసే దేదో చేస్తూ, ప్రతీక్షణమూ తన గుండెల్నిపిండి తన కసిని తీర్చుకుంటాడు. బాధగా మూలిగింది లలిత. ఎన్నాళ్ళింకా తనకి బాధ?

తలుపుతోసుకుని పనిమనిషి వొచ్చింది పాలుతీసుకుని. వొద్దన్నట్లు తలాడించింది లలిత. "అయ్యగారు ఇంకా

రాలేదా?" రాలేదని తనకి తెలుసు. అయినా అడిగింది తెలిసే. వొస్తే తనకి వినిపించదూ? కారు హారన్ మోగటం, కుర్రాడు తలుపుతీయటం – ఇవన్నీ వినిపించేవేగదా తనకి. అయితే మరి తను ఎందుకడిగింది. తనకే తెలీదు.

"బాగా ప్రొద్దు పోతుందని చెప్పారండీ." అతనిపక్క మీది "బెడ్‌షీటు" మారుస్తూ చెప్పింది పనిమనిషి. "అయ్యాగారు తీసుకోమన్నారండీ!" బల్లమీద పెట్టింది పాలు.

"కాసేపు వరండాలో కూర్చుంటాను," అంది లలిత.
"ఈ గాలి మీకు పడదు. వొద్దన్నారండీ. అయ్యాగారు."
"నాకు కూర్చోవాలనుంది నేను కూర్చోవాలి." పెంకెగా అంది లలిత. "అయ్యాగారు మరీ మరీ చెప్పారండీ." "అబ్బ! ఏమిటా తిక్క. కూర్చునేది నేనా అతడా" కోపంగా అరిచింది లలిత. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "అవును! తను అతను చెప్పినట్లే చెయ్యాలి. ప్రతిదానికీ అతనిష్టమే. తనకి స్వేచ్ఛ లేదు. చివరికి తను వరండాలో కూర్చోడానికి కూడా వీల్లేదు. ఎందుకుంటుంది. ఆ రోజులు పోయాయి. తనంటే ఎవరికీ లక్ష్యం లేదు. చివరికి దాసీదానికి కూడా."

బండి తీసుకు వొచ్చింది పనిమనిషి. మెల్లిగా పట్టుకుని ఎక్కించింది. శాలువాకప్పి మెల్లిగా తోసుకుని వరండాలోనికి తీసుకెళ్ళింది. స్తంభానికి "క్రీపర్" అల్లుకుంది. పువ్వులు మిల మిల లాడాయి వీధిలైటు వెలుతురులో. చలికివొణికి స్తంభం చాటున వొదిగాయి.

"ఇక్కడ ఆపనా అమ్మా! అడిగింది దాసీ.

"క్రీపర్"కు పులుముకున్నట్టు పూశాయి పువ్వులు. పువ్వుల్లోంచి గుబాళించిన వాసన గుప్పుమని కొట్టింది తనకి. ఎవరో గుండెల్లో కలుక్కుమని పొడిచినట్లయింది.

తన మొదటిరాత్రి గుర్తుకొచ్చింది లలితకి. గదిబయట వరండా వెన్నెల్లో తన చుట్టూ చేతులేసి అన్నారాయన.

"నాకు పువ్వులూ, పిల్లలూ అంటే ఇష్టం. వెన్నెలా నువ్వూ అయితే మరీని. మన ప్రేమ మామిడిచెట్టుకి మాధవీ లతలా అలా అల్లుకుపోతే యెంత బావుంటుంది యిలాంటి వెన్నెలల్లో" అని. తాను నవ్వింది పెదిమ విరిచి.

"కప్పల్నీ, మనుష్యుల్నీ కోసే తాను అలా మాట్లాడటం — తనకేగాదు. ఎవరికయినా నవ్వు తెప్పిస్తుంది. లలిత గొణిగింది.

"ఇక్కడ కాదు కొంచెం అవతలకి పోనీ." వరండాలో మూలకి తీసికెళ్ళి పనిమనిషి వెళ్ళిపోయింది. దూరంగా కుక్క అరిచింది. తపతపమని వీధిలోంచి ఎవరో నడిచివెడుతున్నారు చలిగాలి చెవుల్ని దూసుకుపోయింది జివ్వున.

తను యింకా రాలేదు. అవును ఎందుకొస్తారు? రమణా మారిపోయాడు. పూర్తిగా మారిపోయాడు. మరీ శారద వొచ్చాక దగ్గర్నుంచీ. ఈ మధ్య తనంటే మరీ లక్ష్యమే ఉండటము లేదు. పైగా రోజు రోజూ కట్టుబాట్లు ఎక్కువయ్యాయి. తను బయట కూర్చో కూడదు. తను తిండి తినకుండా వుండ కూడదు. అతను తెచ్చిన పళ్ళూ అవీ యేమాత్రం మిగల్చ కూడదు, ఏం? తనసంగతి తనకి తెలీదా యెందుకు తన్నిలా యేడిపించడం? ప్రతిదానికీ బలవంతమేనా!

జీవితాంతం ఈ అవిటిదాన్ని యేడిపించి కసిదీర్చుకోవాలనుకుంటున్నాడా? అలా అయితే వొక్కసారి యే సముద్రంలోనో తోస్తే సరిపోదూ? పోనీ తనని ఇంటికిపంపించెయ్యవచ్చుగా తనఅడ్డు తీరిపోతుంది. హాయిగా తను శారదని 'రిజిష్టర్ మ్యారేజి' చేసుకుని తనని మరచిపోయి, అదంతా ఒక పీడకల అనుకుని... లలితకి కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. ఇలా రాత్రుళ్ళు ప్రొద్దుపోయి యింటికి రావాల్సిన అవసరముండదు. తన కాలువంక చూసుకుంది లలిత. సన్నటి షిఫాన్‌నుంచి వెక్కిరిస్తున్నట్టు కనబడింది తనకాలు_అవిటికాలు వెచ్చగా కన్నీరు చంచలమైంచి కారింది.

పనిమనిషి వొచ్చింది.

"అయ్యగారు ఫోనుచేశారండీ" తను మాట్లాడలేదు.

"ఆవిడగారిని ఎందుకో అర్జెంటుగా రమ్మన్నారు."

"ఫో అవతలికి!" కసిరికొట్టింది లలిత.

త్వరగా అడుగులేసి పారిపోయింది భయపడిన పనిమనిషి.

అవును! తనకు తెలుసు. అతడు వొట్టి దుర్మార్గుడు, స్వార్థపరుడు. శారదని ఈ చలిరాత్రి... ఈ ఇంట్లోఅయితే అనుకుని ఎంతిపని చేస్తున్నాడు. రమణా! ఎందుకయ్యా! నన్నిల్లా బాధపెడతావు. పోని ఏదయినా మందుయిచ్చి తనని దూరం చెయొచ్చుగదా! అదయితే ఇంతబాధ ఉండదు. కొన్నిక్షణాల బాధ. కానీ ఇన్నిరోజుల నరకయాతనకంటె నయంగాదూ!

కథా నిలయం
1179

‘కుర్రవాడు గేటు తెరిచాడు ప్లిమత్ కారు దూసుకొని రోడ్డుమీదికి గెంతింది. వీధిదీపాల వెలుతురులో స్టీరింగ్ పట్టుకున్న శారదచేతులు పసిమిబంగారు వన్నెలో తళతళలాడి లలితగుండెల్లో వాతలు పెట్టాయి.

భగవంతుడా! నన్నెందుకు నీలోకి తీసుకోవు, ఎందుకు నాకీయాతన, నే నెం పాపంచేశాను! వెక్కి వెక్కి ఏడిచింది. చలిగాలికి స్తంభాన్నానుకున్న లత వొణికింది. నీరసంగా లలిత బండిలో జారబడింది.

తను ఈమధ్య మరీ ఇంట్లో ఉండటములేదు. కారణం తనకి తెలుసు. అక్కడికీ తను ఉండబట్టలేక అడిగింది. చిన్నగా నవ్వారు. తనగుండెలు దూసుకుపోయేట్టు. ‘ఇంట్లో కూర్చుంటే ప్రాక్టీసెలా?” అని తనబుగ్గమీద చిటికె వేశారు. “అవిటి దానివి నీముందు కూర్చోమంటావా” అని వెక్కిరించినట్టు ధ్వనించింది తనకి. “ఈమధ్యనో కొత్త “ఎక్స్పెరిమెంటు” చేస్తు న్నాను. తరవాత చెబుతాను” అన్నారు నవ్వుతూ. తనకి తెలుసు ఆ “ఎక్స్పెరిమెంటే”మిటో. శారదని ఎందుకు పిలిపించినట్టు? అందుకుగాదూ? ఆసంగతి మళ్ళీ తనకి చెప్పడ మెందుకూ?” ఎక్స్పెరిమెంటట! ఇదోపేరు కామోసు.

తనని ఏడిపించాలనా: తను కుళ్ళికుళ్ళి అలా నీరసించిపోతే... చివరికి చచ్చిపోతే... లలిత బళ్ళుమని ఏడిచింది. వెక్కిళ్ళు వరసగా వచ్చాయి.

తను తెలీకడుగుతుంది గానీ, ముందు తనకి చెప్పకుండా శారద నెందుకురమ్మని రాయాలి? "ఇదుగో లల్లీ పడిపోయి కాలు విరగగొట్టుకున్నది. మనఅడ్డం తీరిపోయింది చూశావా" అని చెప్పటానికా? ఇద్దరూ కలిసి నవ్వుకోడానికా? భగవంతుడు తనని ఇలా యేడిపించాలని కాకపోతే, అంత ఎత్తునించి కాలుజారి మెట్లమీంచి పడినప్పుడు, వొక్క కాలే విరగగొట్టి ఊరుకోవాలా? అప్పుడే చనిపోతే ఈబాధ ఉండేదికాదు గదా! అతనికి తనమీద ఇంతకసి ఉండేదికాదుగదా! అతని పెళ్ళినాటి అందాల లల్లీగా అతనిలో ఒక మధురస్మృతిగా నన్నా మిగిలిపోతే...ఎంత బావుండేది! అవిటికాలుతో ఇంకా అతన్ని వ్రేలాడటంకంటే అది నయంగాదూ? తమ పెళ్ళిరోజులు జ్ఞాపకంవచ్చి లలితమనస్సులో ఆనందం జ్ఞాపకం వచ్చి లలిత మనస్సులో ఆనందం మెరుపులా మెరిసింది.

తనకి అతను రాసిన మొదటి ఉత్తరం ఇప్పటికీ పదిలంగా హృదయంలో దాచిపెట్టుకుంది దానిని తను.

లలితా! నీ ఎర్రని పెదిమ విరుపులోని వొంకరని అవాలని ఉంది. ఎట్లా? తెల్లని పళ్ళు నీనవ్వులో మెరిసినప్పుడు విరిసేకాంతి నాకిస్తావూ? లల్లీ! ఎట్లా నిన్ను నాదాన్ని చేసుకోను. అనుభవం వొద్దులల్లీ! నాకు నువ్వు కావాలి. ఎట్లా మరవను నిన్ను???" ఈమాటలు ఆనాడూ ఈనాడూ తన హృదయంలో చెక్కు చెదరకుండానే ఉన్నాయి: కాని ఆ స్మృతులే ఇప్పుడు విషపూరితమైనాయి. తనగుండెల్ని పిండుతున్నాయి. ఆనాటిరాత్రి! ఆయన బలవంతంగానే తన

చేతుల్లో తినిపించారు తనకి. అయితే ఆ బలవంతంలో ప్రేమ నిండివుంది. అమృతత్వం నిబిడీంది. కనకనే అప్పుడు తను అను రక్త్వంలో వొణికింది. ఇప్పుడు? "తను వరండాలో కూర్చో కూడదు" అని ఆయన అంటే తనకి అఘోరకంగా అనిపిస్తూంది.

మళ్ళీ తిరిగి తను ఆ రోజులు పొందగలదా? రమణి తనని అల్లా దగ్గరికి తీసుకుంటాడా? ఆమెదృష్టి తిరిగి కాలు మీాద పడింది. ఆమె వొణికింది. వికటంగా నవ్వి కాలు తనని వెక్కిరించినట్లయింది

ఉలిక్కిపడింది లలిత. ఎవరో తన్ను చూసి నవ్వు తున్నారు. ఎవరది? తనే! కాదు కాదు. తనుకాదు. ఆ మొహంలో యేదో హాసం వెల్లివిరుస్తోంది. అందులోని పెదిమ విరుపులు తనగుండెల్ని చీలుస్తున్నాయి. ఏమిటది! ఎవరు. అవును నిజంగా తనే. అది నిజంగా తన ప్రతిబింబమే. తనలో నిజంగా అంత ఆనందం వెల్లివిరిసిందా అప్పుడు. నాటి తన ప్రతిబింబమూ అది.

ఆ నాటి సాయంత్రం ముస్తాబయి అద్దంలో చూసుకుంది గర్వంతో తను, బయటనించి ఆయన తొందర చేస్తున్నారు సినిమాకి టయిమయిందంటూ. "ఫినిషింగ్ టచెస్" పూర్తి చేసి గబగబా గెంతింది మెట్లమీాంచి. చీరచెరగు అడ్డంపడింది తను... తనసంగతి తనకి తెలీకుండా పోయింది.

ఆరోజు నిజంగా దురదృష్టకరమయినది. తెలివొచ్చి చూసేసరికి తను హాస్పిటల్‌లోవుంది. వివర్ణపూరితమైన భర్త

మొహంలో విరిసే శూన్యహాస్యాన్ని చూసి తను భయపడి పోయింది బరువుగా కట్లతో వున్న ఎడమకాలు తన్ను వెక్కి-రించింది. కొన్ని క్షణాలక్రితం తను అందాలరాసి, ఆయన హృదయానికి జ్యోతి. ఇప్పుడు? అమ్మావాళ్ళు వొచ్చారు. కన్నీరు కార్చారు. నెలరోజులు ఉన్నారు. తిరిగి వెళ్ళిపోయారు తనహృదయాన్ని శూన్యంచేసి. అంతకంటె ఏంచెయ్యగలరు! ఇన్నాళ్లూ తన భవిష్యత్తుని మరిచిపోయింది. ఇప్పుడు ఆ శూన్యాన్ని పూడ్చటానికి ఆయన మిగిలిపోయారు. తను వొదలకుండా ఆయనమెడని వేళ్ళాడుతూ ఉండిపోయింది.

తనని భరించవలసిన బాధ్యత. తను ఆయన్ని బాధ పెడుతుంది, అవును. తను వొకరికి భారంగా ఉండరాదు. తనబాధని ఎందుకు వ్యక్తంచెయ్యడు అతను. తన్ను చూసి నిదానంగా నవ్వుతాడు. ఆనవ్వులో లోతుల్ని కనుక్కోవాలని ప్రయత్నిస్తుంది తను. తనని వోదార్చటానికి ప్రయత్నిస్తాడు, తననిచూసి బాధపడుతున్నట్టు అనిపించడు ఎప్పుడూ.

కాని తనకి తెలుసు. కొన్ని నెలలక్రితం తనభార్య సౌందర్యరాశి, ఇప్పుడు? ఎందరో "స్పెషలిస్టు"లు ప్రయత్నించి వోడిపోయారు తనకాలి అవిటితనాన్ని మాపటానికి. అలాంటప్పుడు భార్యనిచూసి ఏ మగవాడిహృదయం బాధపడదు!

అలాంటప్పుడు తను ఎందుకు బాధని కప్పిపుచ్చుకోవాలి. తనమీద విసుగు కనబరచవచ్చు. కోపం తెచ్చుకుని తిట్టవచ్చు. బెదిరించవచ్చు. ఏమిమనిషి అతడూ కించిత్తు బాధపడినట్టు కనిపించడే. తనభార్యని బాధపెట్టి తద్వారా

కసితీర్చుకోడేమి. తను కన్నీరు కారిస్తే చూసి ఆనందించడేం. సంతోషంతో కసిదీరా నవ్వడేమి. అవును, ఆయన దేవత లాంటి మనిషి. తనే దురదృష్టవంతురాలు. అలాటిమనిషిని తిరిగి తనవాడిని చేసుకోగలదా తను. ఆయుకేం తెలుసు. అమాయకమయిన మనిషి. 'స్త్రీబుద్ధిః ప్రళయాంతకః' అన్నారు. అలాటి శారదవలలో పడిపోయారు. శారద ఎంత కఠినంగా ఉంటుంది, స్త్రీమనసు తోటిమనిషి తను ఉండగానే తనకళ్ళముందే తనభర్తని వలలో వేసుకుని కులుకుతూ... అసలు తనని ఇక్కడికెవ్వడు రమ్మన్నారు. లలిత ఇంక ఆలోచించలేకపోయింది. ఆలోచించకుండానూ ఉండలేకపోయింది.

అవును! ఆయన ఎంతమంచివారు. కాలు విరిగింతర్వాతకూడా తనంటే యెంతదయగా ఉండేవారు. “లలితా! ఏదో కొత్తపుస్తకాలు తెప్పించి చూస్తున్నాను. దేవుడు దయతలిస్తే నువ్వు మళ్ళీ నాలల్లివి కాగలవు' అన్నారు ఆయన ఒకనాడు మంచంమీద కూర్చుని బత్తాయితొనలు వొలిచి పెదిమలసందున దూరుస్తూ. ఆనందంతో తనకి కళ్ళలో నీళ్ళు చిప్పిల్లినవి. కృతజ్ఞతతో వొంగి ఆయనపాదాలు ముద్దెట్టుకోవాలనిపించింది. ప్రేమతో ఆయనకాళ్ళని పెనవేసుకుపోవాలనిపించింది.

నిజంగా ఆయన దేవతలాంటి మనిషి.

మళ్ళీ కొన్నాళ్ళకివచ్చి ఆయనే చెప్పారు. “నీకాలు నయంకాగలదు. కొన్నాళ్ళలో “వాహరు” ఇక్కడికి వొస్తున్నారు. నేను ఉత్తరం రాశాను. వారే నిన్ను మళ్ళీ నాకివ్వగలుగుతారు” అన్నారు.

ఆమాటలన్నీ ఏమై పోయినాయో ఏమో! శారద వొచ్చింది. అంతే! వొస్తారన్న డాక్టరు రానూ లేదు. ఆయన తరుచూ తనదగ్గిరకి రావటమూ మానేశారు. దీనికంతకీ కారణం తనకి తెలుసు. కాని ఇప్పుడు తను ఆశక్తురాలు. నిరాధార. దురదృష్టం కాకపోతేయేమిటి? దేవుడులాంటి తన మనిషిని ఎలా మార్చేసింది శారద!

తన పెళ్ళిలోనే అనుకున్నారు అంతా. తరవాత ఆ చదువునుచూసి తనకూ అలాగనిపించింది కాని అదే దురదృష్టం రెండేళ్ళతరవాత ఈరూపాన ఒచ్చి పరిహాసిస్తుందని తను కలలోనైనా అనుకోలేదు.

చలి కొరికేస్తోంది. మెట్లమీద యెవరో వస్తున్నారు.

ఉలిక్కిపడింది లలిత. ఇంతసేపట్నుంచీ తను తనని మరచిపోయిందా? చకచకా అడుగులేస్తూ శారద పైకివచ్చింది

“లలితా! బయట కూర్చున్నావా? సరిసరి. నీకు మంచిదికాదని చెప్పలేదూ రమణ?”

రమణమీద తనకి అంతచనువు ఎవరిచ్చారు? లలిత అంతరాత్మ ఘూర్ణిల్లింది. చీకట్లోకూర్చుని లలిత ఏమీ మాట్లాడలేదు. ఏదో మాట్లాడదామనుకుంది. కసిగా తిట్టి తృప్తిపడదామనుకుంది. కాని నోరు పెగిలిరాలేదు.

“లోపలికిపద! నీతో ఓ ‘ఎక్స్పెరిమెంట్’ చెయ్యాలి. రమణకూడా ఒస్తున్నాడు” మృదువుగా బండి తోసుకుని లోపలికి తీసికెళ్ళింది శారద. ముళ్ళమీద కూర్చున్నట్టు బాధపడింది లలిత.

మెల్లిగా మంచం ఎక్కించింది. "బాగా విశ్రాంతి తీసుకో, తరవాత మేం చూసుకుంటాము" అని పనిమనిషిని పిలిచింది శారద. పాలూ పళ్ళూ తీసికొమ్మనిచెప్పి "ఏదో తయారుచెయ్యాలంటూ" హడావిడిగా తనగదిలోనికి పరుగెత్తింది శారద. ఎందుకు తనమీద అంతదయ నటిస్తుంది శారద?

పిచ్చిగాచూస్తూ ఉండిపోయింది లలిత. తలగడ మొహంమీద వేసుకుని నిర్జీవంగాచూస్తూ ఊరుకుంది. భయంకరంగా తల తిరుగుతోంది. చలికి నరాలు జివ్వుమంటున్నాయి.

ఈరాత్రి యెంత భయంకరమయిన రాత్రి! అబ్బ ఎంత చలిగావుంది. తనమనస్సులాగ. అవును ఈరాత్రి తనజీవితంలో మహత్తరమయిన మార్పు జరుగుతుంది. శారదకికూడా తనంటే చులకనే! అవును. తనేగా ఇహ ఈ ఇంటి యజమానురాలు. ఇద్దరూ కలిసి ఎక్కడికయినా వెళ్ళిపోతారా? తన రమణ తనకి కాకుండా పోతాడా? తనని మోసంచేస్తాడా? ఇద్దరూ ఒకటై తనని దూరంచేస్తారా?

కాదు. తనే వాళ్ళకి దూరం అవుతుంది. అవును, అదే నయం. ఈ నరకయాతనకన్న—కనీసం వాళ్ళిద్దరూ సుఖంగా వుండాలి. వాళ్ళిద్దరి సౌఖ్యంకోసం తను ఆత్మబలిదానం చెయ్యాలి. లేకపోతే వాళ్ళే తనను...

భయంకరమయిన యీ ఆలోచనకి లలిత కదిలిపోయింది.

పక్కగదిలోంచి నీళ్ళు మరుగుతున్న శబ్దం. ఏవో మందులు తయారుచేస్తోంది శారద,

"పిచ్చిదానా! ఎందుకంత కష్టపడతావు! కావాలంటే మీ ఇద్దరి సౌఖ్యంకోసం నేనే... అవును. మీరిద్దరూ సుఖంగాఉంటే నాకదేచాలు" లలితకళ్ళల్లో నీరుతిరిగింది.

"శారదా! అయిందా? రెడీయేనా?" ఉత్సాహంగా ధ్వనించింది రమణగొంతుక.

"ఓ...క్ కే నువ్వు సామానును తీసుకురావడమే తర వాయి."

గ్లాసుట్యూబులు టపటప మంటున్నాయి. స్టౌమోత "బయ్" మంటూ వినవస్తోంది. ఏవో అస్పష్టమైన ధ్వనులు. తృప్తిగా, హుషారుగా గదిలో అడుగుపెట్టాడు రమణ. అతని మొహం నీరసించివుంది. కళ్ళలో నిద్ర లేనితనం స్ఫుటమౌ తోంది. విజయరేఖలు హాసంలో విరిశాయి. "లల్లీ!" మృదు వుగా పిలిచాడు. "నిద్రపోతున్నావా ?"

నిలువుగుడ్లువేసి చూస్తోంది లలిత. "లల్లీ!" బుజాలు పట్టుకుని ఊపాడు రమణ. "డాక్టర్!" మంచంమీంచిజారి అతనికాళ్ళమీద పడిపోయింది లలిత.

రమణ ఆశ్చర్యపోయాడు. "నేను...నీ రమణను. ఏమిటా పిచ్చి లల్లీ" భుజాలు పట్టుకుని లేవదీశాడు రమణ. పిల్లలా ఆమెని పొదువుకున్నాడు.

లలిత వెక్కివెక్కి ఏడ్చింది. వెచ్చగా కన్నీరు చెంపల మీంచిజారి గడ్డంకింద దారకట్టింది. "డాక్టర్ ... నేను పోతాను...నీకోసం_శారదకోసం....నికుబరువువొద్దు...నన్ను

దూరంచెయ్యి...డాక్టర్!? లలిత వెక్కి వెక్కి ఏడ్చింది చేతుల్లో మొహం దాచుకుని, బాధగా మూలిగింది.

అతడు ఆశ్చర్యపోయాడు. రమణ మొహం తెల్లబారింది. క్షణకాలం నిరుత్తరుడయ్యాడు. అతని చుట్టూ భూమి గిర్రునతిరిగింది. చుట్టూ చూశాడు. శారద దగ్గర వుందేమోనని గాభరాగా. గభాల్న లలిత పక్కనే చతికిలబడి చెవిలో నోరుపెట్టి గొణిగాడు. "నా లల్లీ! ఏమిటీ పిచ్చినీకు. శారద నాకు అక్కవంటిది. నీ కాలు సరిచెయ్యటానికి పిలిపించాను. మొన్నగదా అమెరికానుంచి వొచ్చింది "సర్జరీ"లో స్పెషల్ ట్రెయినింగ్ పొంది, నా లల్లీ! నీకోసంగదా నాఈ శ్రమంతా నన్ను నమ్మవా?" అతని కళ్ళలో నీరు తిరిగింది. పసిపిల్లవాడిలా ఏడిచాడతను.

లలిత నిరుత్తర అయింది. అతని గుండెల్లో మొహం దాచుకుంటూ వ్రేళ్ళాడింది. "నేను పాపిష్టిదాన్ని...నన్ను దూరం చెయ్యండి, మిమ్మల్ని బాధపెడుతున్నాను" గద్గద స్వరంతో బ్రతిమిలాడింది. అతని పాదాలకి చుట్టుకుపోయింది.

రమణహృదయం తేలికపడింది. చేతుల్లోకితీసుకుంటూ అన్నాడు, "నా పిచ్చిలల్లీ! అల్లరిచెయ్యమాకు నన్ను ఏడిపించమాకు. రేపీపాటికి నాలల్లీ చలాగ్గా ఉండదూ కాలు నయం చేసుకుని" ఆమె ముంగురులు వెనక్కితోశాడు, గడ్డంమీది చిరుచమట తుడిచాడు. పసిపిల్లని బుజ్జగించినట్టుబుజ్జగించాడు. నుదుటిని ముద్దెట్టుకుని చేతిలో చెయ్యివేశాడు.

"ఏమండీ నన్ను క్షమించమని శారదొదినకి చెప్పరూ?" మొహాన్ని అతని గుండెలికి రాస్తూ పలికింది లలిత.

"ఇంకా రెడీ కాలేదా?" అవతలి గదిలోంచి శారద అరిచింది తన లోకంనించి బయటపడి. "నా పిచ్చిలల్లీ! అల్లరి చెయ్యమాకు. చెప్పినట్లువిని మంచిదానివనిపించుకో. నేను నీ వాడిని" అంటూ పసిపిల్లవానిలా చేతుల్లోకి ఎత్తుకొని తీసి కెళ్ళాడు. రానని మారాంచేస్తున్న లలితని "ఆపరేషన్ థియేటర్" లోనికి రమణ.